# తెల్లారింది

- శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

వీధిగేటుకి రెండు వైపులా అల్లుకున్న సన్నజాజీ, విరజాజీ పైకి పాకి పాకి పోర్టికో మీద కలిసిపోయి కబుర్లు చెప్పుకుంటున్నాయి. లేతాకుపచ్చా, ముదురాకు పచ్చా గీతలతో తెల్లటి పూల చుక్కల్ని కలుపుతూ గచ్చకాయరంగు సిమెంటు గచ్చు మీద వచ్చీరాని రథం ముగ్గు వేస్తున్నాయి.


కింద గది కిటికీ బయట, పడికట్టిన పచ్చని మొక్కకి పూసిన ఎఱ్ఱని రామబాణాల గుత్తి సిగ్గరి పెళ్ళికూతురిలా తలంటి పోసుకుని సాంబ్రాణి పొగలో తడి కురులారబెట్టుకుంటున్న కన్నెబంగారులా ఓరగా తలవాల్చి, ఉదయభానుడి రాక కోసం ఎదురు చూస్తున్నట్టుగా ఉంది. ఆయన్ను పలకరించాలనే ఆత్రుతతో పైకి చూస్తున్న పూలుకొన్నీ, తీరా వస్తే ఏమి మాట్లాడాలో తెలియక సిగ్గుతో ముడుచుకుపోయిన మొగ్గలు ఇంకొన్నీ - పాపం ఆ ముగ్ధ ఎటూ తేల్చుకోలేక ఎరుపెక్కిన బుగ్గలతో కొంత ఎదురుచూపులూ, అంతలోనే బెదురుచూపులూగా ఉంది.

అవతలి కిటికీ బయట నిటాగ్గా నిలుచున్న లిల్లీ జెడల్లోంచి తొంగి చూస్తున్న తెల్లపూలు బుల్లిబుల్లి గ్రాంఫోనుల్లా వున్నాయి. వాటిల్లోంచి వీధి అవతల ఎవరింట్లోనో పెట్టిన విష్ణుసహస్రనామం లీలగా వినిపిస్తోంది.

స్టేషనుకెళ్ళే మొదటి బస్సువాడు మెయిన్రోడ్డు మీదున్న స్పీడుబ్రేకరుమీంచి ఎగిరెళ్ళిపోయాడు పేద్దగా రేకుల శబ్దం చేస్తూ. ఆపక్కనే పొంచి వుండి వీపుకి సంచీ తగిలించుకున్న సూపర్ మేనొకడు బస్సు అందుకోలేక, ఇక లాభం లేదని కాళ్ళీడ్చుకుంటూ స్టాపు వైపు నడవడం మొదలెట్టాడు.

టిఫెన్ సెంటరు వాడు అరటి పళ్ళలో అగరత్తులు గుచ్చేసి, పెనం మీద నూనె వేస్తున్నాడు. భక్తి భావమూ, భుక్తి ఆత్రమూ కలగలిసిన కమ్మటి పొగేదో ముక్కు పుటాలని పలకరించి చక్కాపోయింది.

గేటుకి వేళ్ళాడదీసిన నీలం బుట్టలో రెండు తెల్లటి పాకెట్లేసి వెళ్ళిపోయాడు పాలవాడు. రెండు చందమామలు ఉదయించిన నీలాకాశంలా నిండుగా వుందా బుట్ట. పేపరువాడెక్కు పెట్టి విడిచిన నమస్కార బాణం రివ్వునొచ్చి కుర్చీ పక్కనే వాలి పాదాల దగ్గిర ఒదిగిపోయింది. అంత ఒడుపుగా విసరడం ఎవరు నేర్పేరో వాడికి. అక్కడక్కడా జిహ్వాప్రక్షాళనం చేసుకుంటూన్న అరసికుల హాహాకారాలు ఆగి ఆగి వినిపిస్తున్నాయి. ట్యూషన్ నించి ఇంటికెళిపోతూ స్కూటీ మీద ఇద్దరు స్కూలు పిల్లలు. పాపం, వీళ్ళెప్పుడు లేచారో, ఏకలల వేళ మేల్కొన్నారో? అసలు పడుకున్నారో లేదో? పెద్దయ్యాక వీళ్ళకి చిన్ననాటి జ్ఞాపకాలంటూ వుంటాయో లేదో? వున్నా వాటి నిండా స్కూటీలూ, పోటీలూ, పరీక్షలూ ట్యూషన్లేనేమో . ఇంత నిర్దయగా, నిమ్మళంగా ఎవరు ఎత్తుకుపోయారో వీళ్ళ



బాల్యాన్నీ, చిన్నతనాన్నీ !

నలభై యేళ్ళ నల్లని వాడొకడు రొప్పుతూ, పరిగెడుతూ, ఆగుతూ, నడుస్తున్నాడు రోడ్డు వారగా. లావుపాటి ఓ ఆడమనిషి చీపురు నేలకానీ ఆననట్లుంచి రోడ్డూడుస్తోంది. ఆమెని చూసిన నల్లవాడు వేగంపెంచి పరిగెత్తాడు, అతన్ని చూసి గబగబా వూడ్చెయ్యడం మొదలెట్టిందా ఆడమనిషి. అతను కొంచం దూరం వెళ్ళి ఆగి పోయాడు మలుపు తిరుగుతూ. అతను వెళ్ళి పోయాడని నిర్ధారించుకుని ఊడవటం ఆపేసింది ఆడమనిషి.

ఇద్దరు ముసలివాళ్ళు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఒకతలమీద చెవుల్ని కప్పేస్తూ మంకీ కేప్పూ, ఇంకో తలచుట్టూ చెవులు మూస్తూ నాలుగు చుట్లు చుట్టేసిన ముదురు నీలం మఫ్లరూ. ఒకళ్ళ మాట మరొకళ్ళకి వినబడడం దాదాపు అసాధ్యం. అయినా వాళ్ళేవో

మాట్లాడేసుకుంటూ, తలలూపుకుంటూ వెళిపోతున్నారు. బహుశా ఆవయసొచ్చాకా, మనిషితో సంభాషించడానికి మాటలతో పనిలేదేమో!

పార్కు పక్క సందులో చాకలి వాడు ఇస్త్రీ పెట్టె లో బొగ్గులు చేరుస్తున్నాడు. స్కూటర్ వర్కు వాడు అప్పుడే షట్టర్లు తెరుస్తున్నాడు. నర్సింగరావు కేకలకి భయపడి నల్లకుక్క పిల్ల వాళ్ళ గుమ్మం ముందునించి లేచి పరిగెత్తింది. కొత్తగా పెళ్ళైన జంట హోండా సిటీలో తుర్రుమంది. వెనక సీట్లో ఒక నీలం లంచి బాక్సూ, ఒక ఎర్రలంచి బాక్సూ.

ఖాళీ ప్లాటులో గుడిసె లేసుకున్న శామ్యూలు సత్తిగాడు ఆలీబాబా దగ్గర అల్లమురబ్బాలు కొంటున్నాడు. రోడ్డు మీద ఐ.ఎస్.డీ. బూత్ వాడింకా తెరిచాడో లేదోచూసి వెళ్ళిపోతున్నాడో పెద్దాయన. ఎదురుగా వెంకట్రావుగారింట్లో పేద్ద మావిడి చెట్టు పైనంతా పచ్చటి పూల రిబ్బన్నులు కట్టిన భారద్దేశ పటంలా వుంది. అక్కడక్కడా పూతలాంటిదేదో కనబడుతోంది అస్పష్టంగా. పైకొమ్మల్లో ఎక్కడో దాక్కున్న కోయిల వుండుండి కూస్తోంది. ఎంత పరీక్షగా చూసినా ఎక్కడుందో కనబడలేదు. అయినా, కమ్మటి పాటల పిట్టకి కారు నలుపు పులిమేసాడు కదా, మరి ఎల్లా సమర్ధించుకుందావనుకున్నాడో? ఆ దేవుడు! కిందనించి రెండో కొమ్మమీద రెండు పావురాలు కష్టం, సుఖం మాట్టాడుకుంటున్నాయి.ముగ్గుగొట్టంతో తలవాకిట్లోకొచ్చి ఓమాటు అటూ, ఓమాటు ఇటూ తిప్పేసి వెళ్ళిపోయింది ఆండాళ్ళమ్మగారు.


గుమ్మంలో సన్నాయి పాట విని కిందకొచ్చాను. ఇక్ష్వాకుల కాలంనుంచి ఇప్పుడే ఇంపోర్టై వచ్చినట్టున్న ఓ సన్నపాటి ముసలి సన్నాయివాడు, పైనున్న దుప్పట్ల బరువునే మోయలేనంత బలహీనంగా వున్న ఓ గంగిరెద్దూ. చూడగానే గుండె చెరువై కళ్ళమ్మట నీళ్ళుతిరిగాయి. భూపాలం వినిపించాడు. నాన్నకిష్టమైన చక్రవాకమూ, నాకిష్టవైన అభేరీ తనివితీరా మళ్ళీ, మళ్ళీ వినిపించుకుని దక్షిణిచ్చి పంపేసాను. తృప్తిగా దీవించి వెళ్ళిపోయాడు వాడు. "ఇంక ఆగలేను బాబూ! "అంటూ, ఇనస్పెక్షను బంగళా వెనకనించి, వేపకొమ్మలు తప్పించుకుంటూ వెచ్చ వెచ్చని సూర్యుడు పైకొచ్చేసి ప్రపంచాన్ని పలకరించాడు.

అప్పుడూ...... మా కోలనీలో తెల్లారింది!! ***


**CENTENARY CELEBRATIONS OF A LEGEND DR. BEZAWADA GOPALA REDDY**
**Freedom Fighter, Chief Minister of Andhra State, Union Minister and Governor of Uttar Pradesh**

With Best Compliments from Dr. B. Gopala Reddy's **Grand Niece**

**VijayaLakshmi Appareddy, M.D.,**
Vice-Chair, US President's Committee for PID under President Bush




(1907 - 1997)

| | |
|---|---|
| 1937-1939 | Minister, Madras Presidency under Chief Minister, C. Rajagopalachari |
| 1947 | Finance Minister, Government of Madras |
| 1955-1956 | Chief Minister, Andhra State |
| 1956-1957 | Home Minister, Andhra Pradesh |
| 1957-1958 | Finance Minister, Andhra Pradesh |
| 1958-1962 | Member of Parliament, Rajya Sabha |
| 1958-1961 | Minister of Revenue and Civil Expd. Government of India |
| 1962-1967 | Member of Parliament, Lok Sabha from Kavali, AP |
| 1962-1963 | Minister of Information and Broadcasting, Government of India |
| 1967-1972 | Governor of Uttar Pradesh |
| **1989** | **Recipient of TFAS Award for Humanities** |